# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 24-07-2024** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

**1.** రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్రప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.

**2.** ఆంధ్రప్రదేశ్ శాసన సభ సమావేశాల్లో ఈరోజు భూ యాజమాన్య హక్కు రద్దు, ఆరోగ్య విశ్వ విద్యాలయ పేరు సవరణ బిల్లుపై చర్చిస్తున్నారు.

**3.** డిజిటల్ వాణిజ్యం ద్వారా వ్యవసాయ ఉత్పత్తులకు విక్రయ సౌకర్యం కల్పించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు.

**4.** రాష్ట్రంలో రైతుల నుండి సేకరించిన ధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం బకాయిలు చెల్లిస్తోందని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.

**5.** రాష్ట్రంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చర్యలు తీసుకోవాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.యస్ జగన్మోహన్ రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

==========================

రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్రప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. బడ్జెట్ అనంతరం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో పొందుపరచిన అంశాల మేరకు అమరావతి, పోలవరం ప్రాజెక్టులకు నిధులు కేటాయించామని తెలుపుతూ..

…వాయిస్…

-------------------------

రాష్ట్ర శాసనసభ సమావేశాలు మూడవరోజు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ యాజమాన్య హక్కు రద్దు చట్టంపై శాసన సభలో చర్చించారు. అలాగే విజయవాడలోని ఆరోగ్య విశ్వవిద్యాలయానికి ఎన్టీఆర్ పేరు పునరుద్ధరణ బిల్లుపై చర్చించారు. అలాగే గత ప్రభుత్వంలో 2019-24 మధ్య ఆబ్కారీ శాఖ స్థితిగతులపై ఈరోజు శాసనసభలో రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రాన్ని విడుదలచేయనుంది. మరోవైపు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రేపు శాసన సభలో ఓటాన్ ఎకౌంట్ బడ్జెట్ ప్రవేశపెడుతుంది. అదే రోజు మధ్యాహ్నం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది.

---------------------------

డిజిటల్ వాణిజ్యం ద్వారా వ్యవసాయ ఉత్పత్తులకు విక్రయ సౌకర్యం కల్పించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్-ఓఎన్‌డిసీ ప్రతినిధులతో నిన్న ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. డిజిటల్ వాణిజ్య మార్కెట్ ద్వారా వేగవంతమైన వృద్ధిని సాధించేందుకు, ఆయా ఉత్పత్తులను డిజిటల్ అవకాశాలు కల్పించడంపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రైతులు, నేత కార్మికులు, కళాకారులు, డ్రైవర్లు, అంకుర సంస్థలు, ఎంఎస్‌ఎంఈలు, చిన్న దుకాణదారులతో సహా వివిధ వర్గాల ప్రజలకు ఓఎన్డీసీ సేవలను ఉపయోగించుకోవచ్చని తెలిపారు. ఈ-వాణిజ్యం ద్వారా కొనుగోలుదారులు, విక్రేతలు సులభంగా అనుసంధానం అయ్యేలా చేయవచ్చన్నారు. దీనిలో భాగంగా ఉద్యాన, ఆక్వా తదితర రంగాల ఉత్పత్తులను ఈ-వాణిజ్యం ద్వారా అమ్మకాలు సాగించేలా చర్యలు తెలుసుకోవాలని సూచించారు.

---------------------------

రాష్ట్రంలో రైతుల నుండి సేకరించిన ధాన్యానికి వెయ్యి కోట్ల రూపాయల మొత్తాన్ని సమీకరించి ప్రభుత్వం బకాయిలు చెల్లిస్తోందని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రైతులకు ధాన్యం బకాయిలను చెల్లించే అంశంపై శాసన సభలో ఈరోజు పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం చెబుతూ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెలలోపే సుమారు 50 వేల మంది రైతులకు ధాన్యం బకాయిలు చెల్లించేందుకు ఏర్పాట్లు చేసిందని చెప్పారు. గత ప్రభుత్వం రైతులకు ధాన్యం కొనుగోలు మొత్తాన్ని చెల్లించకుండా బకాయిలు ఉంచిందని తెలిపారు. వెయ్యి కోట్ల రూపాయల వరకు సమీకరించి రైతులకు ప్రభుత్వం చెల్లింపులు చేస్తోందని పేర్కొంటూ....

వాయిస్.... 30 సెకన్లు

ఈ అంశంపై మాట్లాడిన పలువురు సభ్యులు రైతులకు బకాయిలు చెల్లించే విషయంలో జాప్యం జరగకుండా చూడాలని కోరారు.

---------------------------

రాష్ట్రంలో తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వం సమర్ధవంతంగా అమలు చేయనుందని రాష్ట్ర మానవ వనరులు, ఐ.టి., ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. తల్లికి వందనం అంశంపై శాసన మండలిలో పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం చెబుతూ ఈ పథకాన్ని పారదర్శకంగా అమలు చేస్తామని చెప్పారు. ఇంట్లో ఎంతమంది పిల్లలు వున్నా ఈ పథకం వర్తింపచేయాలన్నది ఎన్.డి.ఎ. ప్రభుత్వ లక్ష్యమని, ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు పాఠశాలలకు హాజరయ్యే విద్యార్థులకు కూడా తల్లికి వందనం పథకాన్ని వర్తింప చేస్తామని నారా లోకేష్ పేర్కొన్నారు.

---------------------------

ప్రతి గ్రామానికి కుళాయి ద్వారా మంచి నీటి సరఫరాను అందించాలనే లక్ష్యంతో ఏర్పాటైన జలజీవన్ మిషన్ కింద ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 15 కోట్ల ఇళ్లకు మంచినీటి కొళాయి కనెక్షన్లు అందించామని కేంద్ర జల్ శక్తి శాఖ తెలిపింది. 2024 నాటికి కుళాయి కనెక్షన్లు 15 కోట్లకు చేరుకున్నాయని పేర్కొంది. ఈ అంశంపై కేంద్ర

జల్ శక్తి శాఖ మంత్రి సి.ఆర్. పాటిల్ సామాజిక మాధ్యమం వేదికగా స్పందిస్తూ, 2019 నుంచి ఐదు సంవత్సరాల వ్యవధిలో జలజీవన్ మిషన్ ఈ విజయాన్ని సాధించిందన్నారు. ఈ పథకం ద్వారా దేశప్రజలకు స్వచ్ఛమైన నీటిని బహుమతిగా అందించడమే కాకుండా వారి జీవన ప్రమాణాల నాణ్యత మెరుగుపరిచామని పేర్కొన్నారు.

---------------------------

రాష్ట్రంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చర్యలు తీసుకోవాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.యస్ జగన్మోహన్ రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో శాంతి భద్రతల రక్షణకు చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ జగన్మోహన్ రెడ్డి ఆ పార్టీ పార్లమెంట్, శాసనసభ్యులు ఇతర నాయకులతో ఈరోజు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నాని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై రాష్ట్రపతి, ప్రధానమంత్రులతో పాటు, కేంద్ర హెూంమంత్రిని కలిసి సమావేశమై వారికి వివరిస్తామన్నారు.

---------------------------

ఉపాధ్యాయ అర్హత పరీక్ష –టెట్ కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు రాయాల్సిన పరీక్ష పేపర్ ఐచ్ఛికాల ఎంపికలో తప్పులను సరి చేసుకునే అవకాశం కల్పించినట్టు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. టెట్ వెబ్‌సైట్‌లో లాగిన్ అయి దరఖాస్తు డిలీట్ ఆప్షన్ ద్వారా ఓటీపీని నమోదు చేసి దరఖాస్తు డిలీట్ చేసుకోవచ్చన్నారు. అనంతరం పేపర్ మార్పు ఆప్షన్ ద్వారా అభ్యర్థి మార్చుకోదలచిన పేపర్, పరీక్ష అంశంను ఎంపిక చేసుకోవాలన్నారు. సంబంధిత విద్యార్హతలు, మాధ్యమం ఇతర వివరాలు అన్నిటినీ నింపి మరోసారి దరఖాస్తును సమర్పించాలని సూచించారు.

---------------------------

రాష్ట్రంలోని పాఠశాలలు ఈ విద్యా సంవత్సరంలో 233 రోజులు పని చేయనున్నాయి. మొత్తం 315 పని రోజులు కాగా.. ఇందులో 82 రోజులు సెలవులు ఉన్నాయి. ఈ మేరకు విద్యా క్యాలెండర్‌ను పాఠశాల విద్యాశాఖ వెల్లడించింది. అలాగే రాష్ట్రంలో ప్రస్తుత విద్యా సంవత్సరానికి 1 నుంచి 10 తరగుతుల విద్యార్థులకు పరీక్షల షెడ్యూలును కూడా పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. పదోతరగతి విద్యార్థులకు ప్రీఫైనల్ పరీక్షలు వచ్చే ఫిబ్రవరి 10 నుంచి 20 వరకు నిర్వహిస్తారు.

---------------------------

ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదతో రాష్ట్రంలో జలాశయాలకు నీటి ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ధవళేశ్వరం బ్యారేజి వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతుంది. బ్యారేజీ వద్ద 14.90 నీటిమట్టం అడుగులుగా ఉంది. 4 లక్షల 56 వేల 651 క్యూసెక్కుల జలాలు అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు. గోదావరి వరదతో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని లంక గ్రామాలు నీటమునిగాయని అధికారులు తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఈరోజు విద్యాసంస్థలకు జిల్లా కలెక్టర్ మహేశ్ కుమార్ సెలవు ప్రకటించారు. మరోవైపు నంద్యాల జిల్లాలోని శ్రీశైలం జలాశయానికి ఎగువున ఉన్న జూరాల ప్రాజెక్టు నుంచి 1,83,686 క్యూసెక్కుల వరదనీరు వచ్చిచేరుతుంది. ప్రస్తుతం శ్రీశైలం జలాశయం నీటిమట్టం 846 అడుగులు ఉండగా, నీటినిల్వ 72.0497 టీఎంసీలుగా నమోదైంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద గోదావరి నీటిమట్టం 33.15 మీటర్లకు చేరింది. 48 గేట్ల నుంచి 11 లక్షల

క్యూసెక్కుల నీటిని జలవనరుల శాఖాధికారులు దిగువకు వదులుతున్నారు.

---------------------------

ఆధునిక తెలుగు కవులలో ప్రముఖ స్థానం సంపాదించిన గుర్రం జాషువా వర్ధంతి ఈ రోజు. తెలుగు సాహితీ లోకంలో ప్రజ్వరిల్లిన నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా 1895 సెప్టెంబర్ 28వ తేదీన ఆంధ్రప్రదేశ్లోని గుంటూరు జిల్లా వినుకొండలో జన్మించారు. చిన్నతనం నుంచి కులవివక్షతో పాటు అనేక అవమానాలు ఎదుర్కొన్న ఆయన... అంటరానితనం,వెనుకబడిన వర్గాల హక్కుల సాధన వంటి సామాజిక ప్రయోజనం కలిగిన అంశాలు ప్రధాన ఇతివృత్తాలుగా రచనలు చేశారు. “గబ్బిలం” రచనతో మంచి పేరు సంపాదించి, తన కవితా ప్రతిభకు గుర్తింపుగాఎన్నో పురస్కారాలు అందుకున్న గుర్రం జాషువా 1971 జూలై 24వ తేదీన తుది శ్వాస విడిచారు.

=======================